అంగన్‌వాడీల్లో ఆంగ్ల బోధన

- అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన విద్యకు శ్రీకారం
- ప్రీ ప్రైమరీ స్కూళ్లలో ఇంగ్లిష్ చదువులు
- ఆ దిశగా టీచర్లకు శిక్షణ, కిట్ల పంపిణీ



గుమ్మరేగులలో ప్రీ స్కూల్ కిట్లను ఉపయోగించి చిన్నారులకు బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి

రౌతులపూడి: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో వినూత్న మార్పులు తీసుకొచ్చింది. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు మెరుగైన పౌష్టికాహారాన్ని అందించడంతోపాటు నూతన విద్యకు శ్రీకారం చుట్టింది. ఇక్కడ మంచి ఆరోగ్యంతోపాటు చిన్నారులకు మెరుగైన విద్యాబుద్ధులు నేర్పిస్తోంది. అంగన్‌వాడీలను ప్రీ స్కూళ్లగా మార్పు చేసింది. ఇప్పుడు ఆంగ్లంలో బోధించేందుకు ఏర్పాటు చేసింది. అందుకు టీచర్లకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చింది. స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆ దిశగా ప్రత్యేక ప్రణాళికలు, సిలబస్ రూపొందించింది. ప్రభుత్వం చిన్నారుల విద్య కావాల్సిన కిట్లను అందించింది. దీంతో చిన్నారులకు ఆట, పాటలు, వివిధ రకాల బొమ్మలు, పుస్తకాలు ముందుంచి వారిని అలరిస్తూ మంచి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు.

బొమ్మలతో

మండలంలోని రౌతులపూడి, ఎస్.పైడిపాల సెక్టార్లలో 59 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో మూడు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులు సుమారుగా 1270 మందికి పైగా ఉన్నారు. రౌతులపూడి సెక్టార్లో–700 మంది, ఎస్.పైడిపాల సెక్టార్లో–570 మందికి పైగా చిన్నారులు పోషకాహారం తీసుకుంటూ విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాల్లో భాగంగా(ఈసీసీఈ)లో బొమ్మలు తయారీకి అవసరమైన చార్టులు, రంగు పెన్సిళ్లు, స్కెచ్‌లు, రబ్బర్లు తదితర సామగ్రిని ప్రభుత్వం సమకూర్చింది. వీటితో సూపర్‌వైజర్లకు ఇప్పటికే స్త్రీ శిశుసంక్షేమ శాఖ ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. చిన్న చిన్న వస్తువులను ఉపయోగించి వస్తువులు, అంకెలు, పండ్లు, కూరగాయలు, పక్షులు, జంతువులు, వివిధ రకాల వాహనాల బొమ్మలను తయారు చేసి వాటితో కథల ద్వారా చిన్నారులకు చదువుపై ఆసక్తి కలిగేలా చర్యలు చేపడుతున్నారు.

ఆటలతో..

ఆటలతో చదువు నేర్పించేందుకు సామగ్రితో పాటు ప్రీ ప్రైమరీ పాఠశాల బోధనా కిట్లను ప్రభుత్వం అందించింది. అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రతినెలా క్రమం తప్పకుండా ఆయా సెక్టార్లు, ప్రాజెక్టు పరిధిలోను ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వం రూపొందించిన మొత్తం 25 రకాల నూతన మార్గదర్శకాలతో ప్రైమరీ పాఠశాల చిన్నారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆట పాటలతో అలరించేందుకు వీలుగా ప్రత్యేక యుట్యూబ్ ఛానెల్ కూడా ప్రభుత్వం రూపొందించి తద్వారా కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారు.

మంచి బోధన



మా పాపను అంగన్‌వాడీకి పంపిస్తున్నాను. ముందు తెలుగులో అక్షరాలు, చిన్న చిన్న పదాలు, రైమ్స్ నేర్చుకుని ప్రతి రోజు వచ్చి నాకు చెప్పేది. ఇప్పుడు ఇంగ్లిష్ అక్షరాలు నేర్చుకుంటోంది. కేంద్రాల్లో ఇంగ్లిష్‌లో చదువు చెప్పడం ఆనందంగా ఉంది.

– ఉలంపర్తి లోవమ్మ, చిన్నారి తల్లి, గుమ్మరేగుల

ఆరోగ్యంతోపాటు సృజనాత్మక విద్య



ప్రీ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు మెరుగైన పోషకాహారం అందించడమే కాకుండా సృజనాత్మకమైన బోధన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సిలబస్‌ను రూపొందించింది. ఆ దిశగా అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. చిన్నారుల దృష్టి మరల కుండా బొమ్మలు, ఆటపాటలతో చదువు చెబుతున్నాం. ప్రీ స్కూల్ కిట్లను, టీచర్లు సొంతంగా తయారు చేసిన బొమ్మను ఉపయోగించి చిన్నారులకు చదువు చెబుతూ ఆసక్తి పెంచుతున్నారు.

– జానకీలక్ష్మి, ఐసీడీఎస్ విస్తరణాధికారి, రౌతులపూడి

ఫిట్మెంట్ పెంచడంపై ఉద్యోగుల హర్షం



శంఖవరంలో ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న వెలుగు ఉద్యోగులు

శంఖవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని 23 శాతం ఫిట్మెంట్ పెంచడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో వెలుగు శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు స్థానిక ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌ను శంఖవరంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు ఎప్పుడూ వారి సేవలు గుర్తించి అండగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ అయ్యేలా చూడాలని ఉద్యోగులకు సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రత్తిపాడు రూరల్: ఉత్తరకంచిలో ఉపాధి హామీ పనుల నాణ్యతను మంగళవారం బీజేపీ, జనసేన నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి నల్లల రామకృష్ణ, బీజేపీ మండల అధ్యక్షుడు గున్నాబత్తుల రాజుబాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిధులు దారి మళ్లకుండా ఉండేందుకు సోషల్ ఆడిట్ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిజాలు నిగ్గ తేల్చాలన్నారు. యింటి వీరనాగేశ్వరరావు, రామకృష్ణ, అచ్చారావు, శ్రీను తదతరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వంద కుర్చీల అందజేత



సుబ్రహ్మణ్యంకు కుర్చీల పత్రాలను అందజేసిన దివీస్ సీనియర్ మేనేజర్ సుధాకర్

తొండంగి: స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి దివీస్ ల్యాబొరేటరీస్ ప్రతినిధులు మంగళవారం వంద కుర్చీలను అందజేశారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు కూర్చునేందుకు వీలుగా ఒంటిమామిడికి చెందిన దివీస్ ల్యాబొరేటరీస్ సీఎస్ఆర్ నిధులతో ప్లాస్టిక్ కుర్చీలను ఏర్పాటు చేయగా వాటిని దివీస్ సీనియర్ మేనేజర్ ఆర్.సుధాకర్ తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యంకు అందజేశారు. కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు ఈఎస్ నాగరాజు, బి.వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ విజయం సాధించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్ అన్నారు. తూర్పులక్ష్మీపురం గ్రామంలో మంగళవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికీ వెళ్లి వివరించే బాధ్యత గృహసారథులపై ఉందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సీఎం జగన్ మళ్లీ అధికారం చేపట్టేవరకు నిరంతరం శ్రమించాలన్నారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సామంతుల చిన్నారావు, మహీందరావు, యిజనగిరి సత్యవతి, గాది అయిరాజు, దార కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేశ్వరరావు

కిర్లంపూడి: రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 2వ తేదీ నుంచి గ్రామాల్లో నిర్వహించే ఆడుదాం ఆంధ్ర క్రీడల పండగ నిర్వాహణపై మంగళవారం ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు ఆయన కార్యాలయంలో పాఠశాలల పీడీలతో రివ్యూ నిర్వహించారు. 'ఆడుదాం ఆంధ్రా'లో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలను నిర్వహించనున్నారని, దీనికి అనువైన ఆటస్థలాలను గుర్తించాలని పీడీలకు సూచించారు. మండలంలోని 26 సచివాలయాల పరిధిలో 17ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఈ క్రీడలలో పాల్గొనవచ్చని ఎంపీడీఓ రాజేశ్వరరావు తెలిపారు.

రేపు విజయవాడలో ధర్నా

తుని: మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం విజయవాడలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ తుని శాఖ కార్యదర్శి ఎన్.శ్రీనివాస్ మంగళవారం కోరారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఇచ్చిన చాలా హామీలను అమలు చేశారని, మున్సిపల్ కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు చెక్క అప్పారావు, బోడపాటి నూకరాజు, కిశోర్, శాంతికుమారితో కలిసి కమిషనర్ ప్రసాదరాజుకు వినతిపత్రం సమర్పించారు.

కార్యదర్శిపై చర్యలు కోరుతూ ధర్నా



ఏలేశ్వరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పార్టీశ్రేణులు

ఏలేశ్వరం: పేదలపై తప్పుడు కేసులు పెడుతున్న సి.రాయవరం పంచాయతీ కార్యదర్శి వర్మపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణంలో మంగళవారం ధర్నా చేశారు. సీపీఐ(ఎంఎల్)వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆపార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ హైకోర్టులో ఉన్న వివాదం భూమిలో నివాసం ఉంటున్న పేదలపై తప్పుడు కేసు పెడుతున్న కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. కార్యక్రమంలో మొల్లి సత్తిబాబు,నమ్మి అప్పారావు, ఈపీ దేవుడు, కోన దాలమ్మ, ఈపి చినరాజు, దేవర తాతారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి

- రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం



కేఓ.మల్లవరంలో మహిళలకు పథకాలను వివరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మంగళవారం తుని మండలం కేఓ.మల్లవరం, రాపాక గ్రామాల్లో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. నాలుగేళ్లగా సీఎం జగన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాలు పథకాలను, ఒక్కో కుటుంబానికి ఎంతెంత లబ్ధి చేకూరింది మంత్రి దాడిశెట్టి రాజా మహిళలకు వివరించారు. నాలుగేళ్లలో కేఓ మల్లవరానికి రూ.19.35 కోట్లు, రాపాకకు రూ.7.29 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బాగా పని చేస్తుందా, లేదాని అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. ఈ ప్రభుత్వం బాగా పని చేస్తుందని, సంక్షేమ పథకాలు బాగున్నాయని, పథకాలు అన్ని అందుతున్నాయని మహిళలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మరోసారి విజయం సాధించి రెండో సారు ముఖ్యమంత్రి అయిన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరిన్ని పథకాలను అందించనున్నట్టు తెలిపారు. ప్రతిపక్షాల మోసాలకు, అబద్ధపు మాటలకు మోసపోవద్దన్నారు. ప్రజల సంక్షేమానికి కృషి చేసేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అన్నారు. గడప గడపకూ వెళ్లిన మంత్రి దాడిశెట్టి రాజాకు మహిళలు హారతులు పట్టి, నుదుటిన కుంకుమమ దిద్దీ, సోదరుడిలా ఆహ్వానించి పలువురు మహిళలు రాఖీలు కట్టి తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. పెరిక కార్పరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ పురుషోత్తం గంగాభవానీ, మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, సర్పంచ్‌లు దొంక సత్యవతి, గూడుపు గౌరీ కుమారి, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, ఏఎంసీ డైరెక్టర్ అన్నంరెడ్డి వీర్రాఘవులు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు, అధికారులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సరిహద్దు సమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- లబ్ధిదారులకు భూ హక్కు పత్రాల పంపిణీ



రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: దశాబ్దాలు తరబడి భూ సరిహద్దు సమస్యల నుంచి రైతులకు విముక్తి కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం సమావేశపు హాలులో మంగళవారం ఎంపీపీ తోట రవి అధ్యక్షతన జరిగిన భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు అన్యాక్రాంతం కాకుండా శాశ్వత భూహక్కు కల్పించేందుకు రీ–సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం రైతులకు భూ హక్కు పత్రాలను అందజేశారు. మండలంలోని జగపతినగరం, తామరాడ, వీరవరం, రాజుపాలెం, వేలంక, గోనేడ, చిల్లంగి, కిర్లంపూడి, సింహాద్రిపురం గ్రామాల్లో రీ–సర్వే పూర్తి చేసి 6432 మంది రైతులకు భూహక్కు ప్రతాలు పంపిణీ చేసేందుకు రెవెన్యూ సిబ్బంది రంగం సిద్ధం చేశారు.

సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు

అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఎమ్మెల్యే చంటిబాబు విలేకరుల సమావేశంలో అన్నారు. ప్రజల కష్టాలను పట్టించుకోని గత ప్రభుత్వం సీఎం జగన్ ప్రజా పాలనపై నిందలు వేయడం సమంజసం కాదన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన అన్నారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ బొడ్డేటి గణపతి, మండల పార్టీ అధ్యక్షుడు దొమాల గంగాధర్, వైఎస్సార్ సీపీ నాయకులు పెంటకోట నాగబాబు, చదలవాడ బాబీ, భూపాలపట్నం ప్రసాద్, సచివాలయాల మండల కన్వీనర్ పెనగంటి రాజేష్, తహసీల్దార్ కేవీ మాధవరావు, ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు, సంఘన వెంకటేశ్వరావు, బిళ్ళకుర్తి శివాజీ, సూతి శ్రీను, బొజ్జపు శ్రీను, దాడి పెద్దబుజ్జి, యల్లపు శివ పలువురు పాల్గొన్నారు.

ఇస్రోకు ఆల్ ది బెస్ట్



ఇండియా ఆకారంలో ఉన్న ఏపీఎంఎస్ విద్యార్థులు

ఇండియా ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

తుని రూరల్: చారిత్రాత్మక ఘట్టానికి మరి కొన్ని గంటల దూరంలో ఉన్న చంద్రయాన్–3కి, ఇస్రో శాస్త్రవేత్తలకు తుని మండలం హంసవరంలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు వినూత్నంగా ఆల్‌ది బెస్ట్ (శుభాకాంక్షలు) చెప్పారు. మంగళవారం ప్రిన్సిపాల్ పుల్ల పద్మజ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సహకారంతో చంద్రయాన్–3 రాకెట్ చుట్టూ భారతదేశ పటం ఆకారంలో విద్యార్థులు మానవహారంగా నిలిచి ఆల్ ది బెస్ట్‌గా చెప్పారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికను అనుసంధానం చేస్తూ మానవ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న ఇస్రోకి మనమంత ఎంతో రుణపడి ఉన్నామన్నారు. చంద్రయాన్–3 విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ తమ విద్యార్థులు, ఉపాధ్యాయులు మానవహారంగా నిలిచారన్నారు. చందమామపై చంద్రయాన్–3 కాలు మోపే ఘట్టాన్ని ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించేందుకు తమ విద్యార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆమె వివరించారు. దీనివల్ల ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక రంగాలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి

గోకవరం: గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. మండల పరిధి అల్లవరంలో తరచూ విద్యుత్ కోతలు ఎందుకు చేస్తున్నారని ఉద్యోగులను గ్రామస్తులు నిలదీశారు. కరెంట్ పోవడంలో దోమల కాటుకు గురై అనారోగ్యాల బారిన పడుతున్నమని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన అధికారులు చొరవ చూపి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న మాజీ న్యాయమూర్తి సత్యనారాయణ

ప్రత్తిపాడు: విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కన్స్యూమర్ గ్రీవెన్స్ ఫోరమ్ చైర్‌పర్సన్, మాజీ న్యాయమూర్తి బి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో మంగళవారం పూర్వ తూర్పు గోదావరి జిల్లా స్థాయి విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కార న్యాయస్థానం కార్యక్రమాన్ని నిర్వహించారు. వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. న్యాయస్థానంలో 11 విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులందినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జగ్గంపేట డీఈ కె.రత్నాలరావు, ప్రత్తిపాడు ఏడీఈ రాజశేఖర్, హరిబాబులతో పాటు ఏలేశ్వరం, అన్నవరం తదితర సబ్ స్టేషన్ల విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

26న సామాజిక తనిఖీ ప్రజావేదిక

గోకవరం: మండలంలోని నిర్వహించిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక ఈ నెల 26న స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పద్మజ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోకవరం మండలంలో గత ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకూ జరిగిన ఉపాధి పనులపై తుది నివేదికను ప్రజా వేదికలో అందజేస్తారన్నారు.

లింగంపర్తిలో భగవద్గీత ప్రచారం

ఏలేశ్వరం: లింగంపర్తిలో మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. రాజమహేంద్రవరం త్రైత సిద్ధాంతం ప్రమోద సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు ఆధ్వర్యంలో గ్రామంలోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీతను ప్రతి ఒక్కరూ పఠించాలన్నారు. కమిటీ సభ్యులు దవులూరి సత్యనారాయణ, ఆదిబాబు, సత్యవతి, మూర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



దివ్యాంగ చిన్నారులకు ఆటవస్తువులు అందజేస్తున్న అభిమానులు

ఏలేశ్వరం: పద్మవిభూషణ్, మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలతో కేక్ కట్ చేయించారు. అనంతరం దివ్యాంగ పిల్లలకు అబాకస్, అల్ఫాబెట్స్, పలకలు, ఆటవస్తువులు అందజేశారు. కార్యక్రమంలో అడపా దుర్గారావు, తోట రాజేష్, కోరాడ రాజు, గొడత రాజు, మద్దుల స్వరూప్, గోళ్ల విజయ్, గట్టిం కాపు, భవిత సిబ్బంది పాల్గొన్నారు.

వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు



శివరామపట్నంలో వన్యప్రాణి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న వెంకట్రావు

గోకవరం: వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని ఫారెస్టు సెక్షన్ అధికారి పి.వెంకట్రావు అన్నారు. కామరాజుపేట గ్రామ పంచాయతీ, శివరామపట్నంలో రాజమహేంద్రవరం రేంజి అధికారి ఆదేశాల మేరకు వన్యప్రాణి సంరక్షణ చట్టాలపై మంగళవారం గ్రామస్తులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవిలో జీవించే ప్రతి జీవికి సంరక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఎవరైనా అడవి జంతువులను వేటాడినా, ఉచ్చులు పన్నినా, విద్యుత్ తీగలు అమర్చినా వారిపై సెక్షన్ 1972 ప్రకారం శిక్షార్హులన్నారు. జంతువులు గ్రామాల్లోను, పొలాల్లోను సంచరించినట్లు అనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎస్ఎస్ చైర్మన్ గాబు రాంబాబు, బీటు అధికారులు డి.కామేశ్వరరావు, రాజీరమేష్ తదితరులు ఉన్నారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన



మహిళలకు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఇ.గోకవరం, మెట్టచింత గ్రామాల్లో జిల్లా ప్రకృతి వ్యవసాయం, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పెరటి మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీసీఎన్ఎఫ్ ఎన్ఎస్ఎఫ్ పి.శిరీష మాట్లాడుతూ సమతుల్య పోషకాహారం తీసుకోవడంతో మన శరీరానికి కావలసిన పోషక పదార్థాలు, ప్రోటీన్స్, కార్బోహైడ్రేట్స్, ఫాట్స్, విటమిన్స్ అందుతాయన్నారు. మహిళలకు చిరుధాన్యాల వాటి వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. 50 మంది మహిళలకు రిలయన్స్ ఫౌండేషన్ 11 రకాలు విత్తనాలను అందాంచారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ బర్రే నాగేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ ప్రత్తిపాడు మోడల్ పాయింట్ పర్సన్ ఎం.చిన్నబాబు, యూనిట్ ఇన్‌చార్జి బి.నాగేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ, రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది యు.రమేష్ బాబు పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువపై సమీక్ష



కార్యక్రమంలో మాట్లాడుతున్న సూర్యప్రకాశరావు

రౌతులపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం చేపట్టిన జగనన్న పాలవెల్లువ కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని కాకినాడ జిల్లా సంయుక్త సంచాలకులు ఎస్.సూర్యప్రకాశరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.గోవింద్ ఆధ్వర్యంలో జగనన్న పాలవెల్లువపై రౌతులపూడి, శంఖవరం మండలాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి జిల్లాలోనే రౌతులపూడి మండల సిబ్బంది ప్రథమస్థానంలో నిలిచారన్నారు. రైతులకు పశుపోషణకు సంబంధించి పనిముట్లు కొనగోలుకు, సహకార బ్యాంకుల ద్వారా రూ.35000 పెట్టుబడి రుణాల కింద ఇస్తామన్నారు. గ్రామాల్లో జగనన్న పాలవెల్లువపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార టీకేడీ ప్రసాద్, పశుసంవర్ధక సహాయ సంచాలకుల డాక్టర్ పి.మనోజ్, పశువైద్యులు వీర్రాఘవరావు, ప్రసాద్, లావణ్య, అమూల్ ప్రతినిధులు, వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.